క్లుప్తంగా

మోడల్ టెల్‌కు 34 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

టెక్కలి: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ మోడల్ టెల్‌కు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 34 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వర్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వీరికి ఏడాదికి రూ.2.4 లక్షల వేతనం అందజేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారి సంతోష్‌కుమార్ తదితరులు అభినందించారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న డీఎల్‌పీవో రమణ

సంతబొమ్మాళి: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఐవీ రమణ సూచించారు. మండలంలోని ఇజ్జువరం గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలను సోమవారం నాటారు. మొక్కలతో మానవ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.ఉమాపతి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షునిగా వాసు



వాసుదేవరావు

కాశీబుగ్గ: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) పలాస నియోజకవర్గం అధ్యక్షుడిగా పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన గోరు వాసుదేవరావు నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో అఖిల భారత యువజన సమాఖ్య బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రం సోమవారం అందించారు. ఆయనకు పలువురు విద్యావంతులు, విద్యార్థి సంఘాలు అభినందనలు తెలిపారు.

పాఠశాల విద్య కీలకం



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులకు పాఠశాల విద్య కీలకమని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ నీలారావు, హెచ్‌ఎం అప్పలస్వామి అన్నారు. మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పెద్దబొడ్డపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని ఉప్పాడ త్రివేణి ట్రిపుల్ ఐటీకి ఎంపికవ్వడంపై సోమవారం పలువురు అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'జీడికి మద్దతు ధర కల్పించాలి'



జీడిపిక్కల బస్తాకు మంటపెట్టిన రైతులు, వామపక్ష పార్టీలు

కాశీబుగ్గ: జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ జీడి పిక్కల బస్తాకు మంట పెట్టి, రైతులు వినూత్న రీతిలో పలాస తహసీల్దార్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీలతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. 80 కేజీల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర కల్పించాలని, ఈ మేరకు ఈనెల 18వ తేదీన జరగనున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

వలంటీరుపై విచారణ

కంచిలి: మండలంలోని జలంత్రకోట సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ ఎస్.భువనేశ్వర్‌పై ఈవోపీఆర్డీ రాంబాబు, మిగతా సెక్రటరీల బృందం గ్రామంలో సోమవారం విచారణ చేపట్టారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలియజేశారు. ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తానని వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు నిజమవ్వడంతో వలంటీర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. విచారణలో సెక్రటరీలు ఈశ్వరరావు, విజయలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్స్ బి.రమేష్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష



కోటబొమ్మాళి: చిన్నసానలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి తదితరులు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చారని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించారు. 11 రకాల సేవలను ఉచితంగా ప్రజలకు అందజేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మందస: సిరిపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న పీడీ విద్యాసాగర్ తదితరులు



నందిగాం: కవిటి అగ్రహారంలో మాట్లాడుతున్న కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్

టీడీపీ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

● వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజం

వజ్రపుకొత్తూరు రూరల్: అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం, అభివృద్ధితో పాటు ఉద్దాన జీడి రైతుల సమస్యలను విస్మరించిన టీడీపీ నాయకులు నేడు మళ్లీ అధికారంలోకి రావడం కోసం చేస్తున్న వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ మండల పరిషత్ ప్రత్యేక అహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అక్కుపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. బస్సుయాత్ర పేరుతో రాష్ట్ర టీడీపీ నాయకత్వం దిగివచ్చి అక్కుపల్లిలో జీడి రైతులతో ముఖాముఖి పెట్టినా, ఒక్క జీడి రైతు అయినా వచ్చారా అని ప్రశ్నించారు. అలాగే జీడి పిక్కల మద్దతు ధరపై టీడీపీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. జీడి మద్దతు ధర కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశం అని, రెండుసార్లు ఎంపీ అయిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ఎప్పుడైనా ప్రస్తావించారా అని ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంతాన్ని 60 ఏళ్లు పాలించిన గౌతు కుటుంబం ఈ ప్రాంతంలో ఒక్కటైనా శాశ్వత ప్రాజెక్ట్ చేపట్టారా అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మంత్రి సీదిరి అప్పలరాజు కృషితో నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం రూ.50 కోట్లతో 200 పడకల అస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌తో పాటు రూ.700 కోట్లతో ఉద్దాన ప్రాంతానికి శుద్ధజలం కోసం పనులు చేపడుతున్నారని తెలియజేశారు. అలాగే అక్కుపల్లి, వెంకటాపురంలో నూతనంగా అస్పత్రి నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా బ్రిటిష్ కాలం నుంచి ఉన్న ఇరుకు రోడ్డులను డబుల్ రోడ్డుగా మార్చిన ఘనత మంత్రి సీదిరికే దక్కిందన్నారు. అభివృద్ధిని ఓర్వలేక విష ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డి కరుణాకర్, కోడ సోమేశ్వరరావు, తిర్రి రాజారావు, జోగి అప్పారావు, డొంక విద్యాసాగర్, యోగి తిరుపతి, తిర్రి లక్ష్మీనారాయణ, గూడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

విద్యుత్ స్తంభాల మార్పు



కాశీబుగ్గ: సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



సోంపేట: జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 12వ వార్డులో విద్యుత్ స్తంభాలను సోమవారం మార్పు చేశారు. వర్షాకాలం ప్రారంభమవ్వడంతో ఐరన్ స్తంభాలకు బదులు సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పల్లివీధి తాటివీధి, హరిజన వీధుల్లో మొత్తం 9 ఐరన్ స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలు వేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పోతనపల్లి హరిప్రసాద్, స్థానిక నాయకులు తెప్పల ప్రసాద్, లండ మహేష్‌కుమార్, లండ రమణ, హేమారుపు తాతారావు, బన్నాడ ఆనంద్, ఇచ్ఛాపురం బాబూరావు, చెరుకుపల్లి నేతాజీ, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీ పరిధి పలాసపురం జగనన్న కాలనీలో సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలు, బల్బులను సోమవారం ఏర్పాటు చేశారు. ఆయనతోపాటు గ్రామస్తులు, సిబ్బంది ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కాశీబుగ్గ: మహిళలు స్వయం శక్తి సంఘాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు ఆకాంక్షించారు. పలాస మెప్మా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలియజేశారు. నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తున్నారన్నారు. సమావేశంలో సిటీ మిషన్ మేనేజర్ పిన్నింటి మోహనరెడ్డి, సీవో స్వప్నకుమారి, డీఈవో బోర విజయ కుమార్ రెడ్డి, సీఎల్‌ఆర్పీలు కవిత, సంధ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

సంక్షిప్తంగా..

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కనిష్క అన్నారు. మండలంలోని పెద్దబొడ్డపాడు గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల మేరకు ప్రజల చెంతకు వచ్చి వైద్య సేవలను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చక్రధర్, ఎంఎల్‌హెచ్‌పీ యశోద, సిబ్బంది మహాలక్ష్మి, చిన్నమ్మ, తేజావతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి భూమిపూజ

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికిలపాడు జగనన్న కాలనీలో తాగునీటి బోరు నిర్మాణానికి సర్పంచ్ నేతింటి అప్పలస్వామి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలోఎంపీటీసీ బొడ్డు అప్పన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

ఇచ్ఛాపురం రూరల్: అక్రమ మద్యం రవాణా కేసుల్లో అదుపులో ఉన్న ద్విచక్ర వాహనాలను మంగళవారం ఉదయం వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎస్.గురుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గలవారు తమ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

పరామర్శ

కంచిలి: మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన కోన చంద్రమణి(32) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు నేతలు పైల లక్ష్మీనారాయణ, గణేష్ రెడ్డి, కాయ నూకయ్య, సచివాలయ కన్వీనర్ గేదెల శంకర్, రంగాల జగన్ పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్ష్యరాసులైన తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని బాలికలు నినదించారు. స్థానిక జెడ్పీ ఒడియా ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై పాఠశాల ఆవరణలో సోమవారం మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని హెచ్‌ఎం పి.జ్యోతి అన్నారు. మండలంలోని మడియారపుట్టుగ ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన దట్టి అజయ్‌కుమార్ విద్యా సామగ్రి, క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు రూ.13,000 వితరణగా సోమవారం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి పొట్టియ్య పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కంచిలి: మండలంలోని పెద్ద శ్రీరాంపురం పంచాయతీ పరిధి చిన్న శ్రీరాంపురం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి తన భార్య కనిపించడం లేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయిందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరికి ఈ ఏడాది మే 4వ తేదీన వివాహమైంది. దీంతో ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ నిరసన

సోంపేట: కృష్ణా జిల్లాకు చెందిన న్యాయవాది గోరిపర్తి శ్రీనివాసరావుపై మారణాయుధాలతో దాడి చేయడాన్ని నిరసిస్తూ సోంపేట బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం విధులను బహిష్కరిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సోంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీర నాగభూషణరావు, ఉపాధ్యక్షుడు రమణ చౌదరి, సీనియర్ న్యాయవాదులు వడిశ బాలకృష్ణ, నాయుడు, శైలేంద్ర, సర్వేశ్వరరావు, పున్నయ్య, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్‌గా విశ్వనాథం

టెక్కలి: ఉత్తరాంధ్ర రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ కన్వీనర్‌గా టెక్కలికి చెందిన సంపతిరావు విశ్వనాథంను నియమించారు. ఈ మేరకు భావ ప్రచార పరిషత్ అధ్యక్షుడు శ్రీమత్ స్వామి స్వసంవేద్యానందాజీ ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రకటన జారీ చేశారు. ఆయనతో పాటు సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రామానికి చెందిన కారాడ నీలకంఠంను సహాయ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు.

'రూ.50 లక్షల పరిహారం అందజేయాలి'

టెక్కలి: మండలంలోని జీడిపేట సమీపంలో ఉన్న సీహెచ్.రావ్ గ్రానైట్ క్వారీలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకుడు ఎన్.షణ్ముఖరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రానైట్ క్వారీలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. తక్షణమే అధికారులు తనిఖీలు చేయాలన్నారు. అంతేకాకుండా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలన్నారు.

అంకితభావంతో పని చేయాలి

నందిగాం: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన బెజ్జిపల్లి, పెద్దతామరాపల్లి, పెద్దబాణాపురం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో జగనన్న సురక్ష నిర్వహణపై సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్, నాయకులు తమిరె దేవేంద్రరావు, నారంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



జీపుజాత చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన రైతుల సమస్యలపై కాశీబుగ్గ సంత మైదానంలో మంగళవారం నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన్‌రావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని బాతుపురం, గుణుపల్లి, మోట్టూరు, పల్లిసారథి, కిడిసింగి, వజ్రపుకొత్తూరు, చినవంక గ్రామాల్లో జీపుజాత కార్యక్రమం సోమవారం చేపట్టారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తమ్మినాన భాస్కరరావు, కొర్నాన బాలాజీ, బి.రామకృష్ణ, టి.లక్ష్మణరావు, కాంతారావు, డి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ప్రతీ ఎకరాకు సాగునీరు



గ్రోయిన్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

● జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ఈదుపురంలో బహుదానదిపై రూ.28 లక్షలతో చేపడుతున్న కేశుపురం న్యూ గ్రోయిన్ పనులను వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తిత్లీ తుఫాన్‌లో కొట్టుకుపోయిన గ్రోయిన్ మరమ్మతులు చేపట్టేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం తాత్సారం చేయడంతో, నాలుగేళ్లుగా సుమారు పది గ్రామాల రైతులు పంటలు పండించేందుకు నానా అవస్థలు పడ్డారన్నారు. దీంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలియజేశారు.

రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టి రైతులకు మేలు చేయడం జరుగుతుందన్నారు. ఆమెతో పాటు రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపీపీలు దువ్వు వివేకానందరెడ్డి, దున్న గురుమూర్తి, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, గుజ్జు ఢిల్లీరావు, దుక్క ధనలక్ష్మి, కారంగి త్రినాథ్‌రెడ్డి, సీలాపు సారథిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ దక్కత నూకయ్యరెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్ కలెక్టర్ స్పందనకు 10 వినతులు



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 వినతులు వచ్చాయని అధికారులు తెలియజేశారు. దీనిలో భాగంగా దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, రూ.6 వేల పింఛన్ అందజేయాలని కోరారు. తనకు పాసు పుస్తకం మంజూరు చేయాలని టెక్కలికి చెందిన ఎస్.హేమసుందర్ విన్నవించారు. వెబ్‌ల్యాండ్‌లో తన భూమి రికార్డులను సరిచేయాలని సంతబొమ్మాళికి చెందిన అనంత భవాని కోరారు. టెక్కలి మండాపొలం కాలనీలో ఉన్న 6, 7 వీధుల్లో మురుగు కాలువల నిర్మాణం చేయాలని ఆర్.సునీత, సుందరమ్మ తదితరులు వినతి అందించారు. అయ్యప్పనగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఎస్.నాగయ్యతో పాటు కాలనీ వాసులు విన్నవించారు. వినతుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బీఎల్‌వోలపై సబ్ కలెక్టర్ ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పరిధిలో పనిచేస్తున్న పలువురు బీఎల్‌వోలపై టెక్కలి సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెండు మండలాల బీఎల్‌వోలతో ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతబొమ్మాళి మండలానికి చెందిన పది మంది బీఎల్‌వోలు ఆలస్యంగా రావడంపై అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. తదుపరి సమావేశానికి సరైన సమాచారంతో రావాలని లేనిచో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇంటింటా సర్వేచేసి ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు.

ఈనెల 28వ తేదీ నుంచి రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్‌లను పిలిచి వారి సమక్షంలో ఓటరు నమోదు, తొలగింపు చేపట్టాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, జె.చలమయ్య, ఎలక్షన్ డీటీ వై.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుప్పిలి పణీంద్రకుమార్‌ను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి సన్మానించారు. ఎంపీడీవో రాసిన జయహో వలంటీర్ కవిత సాక్షి పత్రికలో సోమవారం ప్రచురితమవ్వడంతో అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, డీటీ రఘుపతి మధు, వెటర్నరీ ఏడీ ఎం.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు జనాలు కరువు



కార్యకర్తలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో సోమవారం టీడీపీ చేపట్టిన బస్సు యాత్రకు జనాలు కరువయ్యారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్, గౌతు శిరీషాలు పాల్గొన్న కార్యక్రమంలో ఈదుపురం వంతెన వద్ద సెల్ఫీ తీసుకొని వేంకటేశ్వరుని ఆలయం వద్ద సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ఆద్యాంతం విమర్శలకే పరిమితమవ్వడంతో స్థానికులు అక్కడ నుంచి జారుకున్నారు. ఇదిలా ఉండగా పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెంనాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు కార్యక్రమానికి డుమ్మా కొట్టడంతో కింజరాపు అభిమానులు బస్సు యాత్ర నుంచి తిరుగు ముఖం పట్టారు.

సోంపేట: టీడీపీ నాయకులు చేపడుతున్న బస్సు యాత్రలో భాగంగా సోంపేటలో సోమవారం నిర్వహించిన సమావేశం కార్యకర్తలు లేక వెలవెలబోయింది. రాష్ట్రస్థాయి నాయకులు సమావేశానికి వచ్చినా తక్కువ మంది కార్యకర్తలు రావడం విశేషం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, రాష్ట్ర ముఖ్యమంత్రిని విమర్శించడమే ధ్యేయంగా సభను నిర్వహించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్, పార్టీ నాయకులు గౌతు శ్యామసుందర శివాజీ, కూన రవి తదితరులు పాల్గొన్నారు.